# 17833 కంటే కింద ముగిస్తే

# స్వల్పకాలంలో దిగువకు




**సమీక్ష:** గతవారం ట్రేడింగ్ ఊగిసలాటలో సాగింది. 18000 స్థాయిలకు దిగువగా.. దాదాపు 263 పాయింట్ల నష్టంతో ముగిసింది.

అంచనాలకు తగ్గట్టుగా కార్పొరేట్ ఫలితాలు వెలువడకపోవడంతో మార్కెట్ గతవారం బలహీనంగా మొదలైంది. ఐరోపా బ్యాంకుల పరిస్థితిపై అనుకూల నివేదిక వచ్చినా పెద్దగా ఫలితం లేకపోయింది. రిజర్వు బ్యాంకు పరపతి సమీక్ష అంచనాలకు అనుగుణంగా ఉండడంతో మంగళవారానికి కాస్త కోలుకుంది. అయితే తర్వాత డెరివేటివ్ గడువు నేపథ్యంతో పాటు నిస్తేజ కార్పొరేట్ ఫలితాలతో విక్రయాల ఒత్తిళ్లు అధికమయ్యాయి. వారాంతంలో 17839 వద్ద కనిష్ఠ స్థాయిని నమోదు చేసుకుంది. చివరకు 17868 వద్ద ముగిసింది.

**ఎఫ్ఐఐల తీరు:** ఎఫ్ఐఐలు; ఫండ్లు తమ ధోరణిని కొనసాగించాయి. విదేశీ సంస్థాగత మదుపుదార్లు (ఎఫ్ఐఐలు) రూ.6491 కోట్ల నికర కొనుగోళ్లు చేయగా.. మ్యూచువల్ ఫండ్లు రూ.1955 కోట్ల నికర విక్రయాలు చేశాయి.

**రంగాల వారీగా:** వరుసగా రెండో వారమూ పీఎస్‌యూ రంగం కొనుగోళ్లను ఆకర్షించింది. మార్కెట్ పతనంలో మన్నికైన వినిమయ వస్తువులు, ఎఫ్ఎమ్‌సీజీ వంటి రక్షణాత్మక సూచీలపై మదుపర్లకు ఆసక్తి పెరిగింది. అంచనాలకు అనుగుణంగా ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష రావడంతో బ్యాంకింగ్ షేర్లకు గిరాకీ హెచ్చింది. ఫలితాల నేపథ్యంలో యంత్ర పరికరాలు, చమురు-సహజవాయువు, స్థిరాస్తి వంటి రంగాలు విక్రయాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

శుక్రవారానికి లాభపడిన, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:5గా నమోదవడం మార్కెట్లో విక్రయాల ఒత్తిళ్లను సూచిస్తోంది.

**భవిష్యత్ అంచనాలు:** వరుసగా మూడు వారాలు పెరిగిన అనంతరం గతవారం మార్కెట్ నష్టాలను చవిచూసింది. మూడువారాల కనిష్ఠ స్థాయి 17839కి చేరింది. ఇది స్వల్పకాలంలో బలహీనత కొనసాగుతుందనడాన్ని సూచిస్తోంది. స్వల్పకాలంలో సెన్సెక్స్‌కు 17374 వద్ద బలమైన మద్దతు లభిస్తుందని అంచనా. మరో పక్క ఈ కీలక స్థాయి కంటే దిగువకు మార్కెట్ వస్తే గనుక 16500 వరకూ పతనమయ్యే అవకాశాలున్నాయి. మరోసారి 18040 పైన ముగిస్తే స్వల్పకాల ర్యాలీకి అవకాశముంది.

**ప్రభావితం చేసే అంశాలు:** వాహన విక్రయాలు, సిమెంటు ఉత్పత్తి, ద్రవ్యోల్బణ గణాంకాలు, రుతపవనాల ధోరణి, పార్లమెంటరీ సమావేశాల నిర్ణయాలు వంటివి స్వల్పకాలంలో ప్రభావం చూపనున్నాయి. మధ్యకాలానికి అమెరికా గృహ విక్రయాల, నిరుద్యోగ గణాంకాలు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, యురోపియన్ సెంట్రల్ బ్యాంక్‌ల ప్రకటనలను మార్కెట్ దగ్గరగా పరిశీలించొచ్చు. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎంపిక చేసిన స్క్రిప్‌లలో కదలికలను అంచనా వేయొచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 17599, 17489, 17374; **తక్షణ నిరోధ స్థాయిలు:** 18040, 18137, 18238

**'ట్రెండ్‌లైన్ 6' స్థాయి 17833 కంటే కింద మార్కెట్ ముగిస్తే మార్కెట్ స్వల్పకాలంలో కిందకు రావొచ్చని అంచనా.**

*–సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*